క్లుప్తంగా

శిశువుల ఆరోగ్యంపై నివేదికలు



ఆశ వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యురాలు ధనలక్ష్మి

రోలుగుంట: గృహ సందర్శన ద్వారా శిశువుల ఆరోగ్య నివేదికలు తయారు చేసి అందించాల్సిందిగా ఆశా వర్కర్లను స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు కె.ధనలక్ష్మి ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీ పరిధి ఆశా వర్కర్లతో ఆమె మంగళవారం సమావేశమయ్యారు. నెల లోపు, ఏడాది లోపు శిశువుల ఆరోగ్య గణనపై సూచనలిచ్చారు. క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు వేయించేలా చూడాలన్నారు. తొలుత శిశువు బరువు లెక్కించి, వయసుకు తగ్గ బరువుందా? లేదా? తెలుసుకోవాలన్నారు. తక్కువ బరువున్న శిశువుల పోషణపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. సమావేశంలో స్థానిక ఎంపీహెచ్ఈవో శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ సరసుద్ది లక్ష్మి పాల్గొన్నారు.

5న వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట



కొత్తగా నిర్మించిన వీరబ్రహ్మేంద్ర ఆలయం

మాకవరపాలెం: మండల కేంద్రంలోని కొత్త వీధిలో నిర్మించిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 5న విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంతం ఆదినారాయణ, ఆరిపాక శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి ఆలయం వద్ద ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ఠ రోజున కల్యాణం జరిపి, మధ్యాహ్నం అన్నసమారాధనకు ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

పాచిలవానిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్



వైద్య పరీక్షలను చేస్తున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

కె.కోటపాడు: పాచిలవానిపాలెంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య సేవలు అందించారు. చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మణ్యం 89 మందికి వైద్య పరీక్షలను జరిపి, ఉచితంగా మందులు అందించారు. అంగన్‌వాడీ చిన్నారులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించి, వైద్యం పొందేందుకు ఆస్పత్రికి వెళ్లలేని స్థితిలో ఉన్న ఆరుగురు రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం అందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డీఎస్ఎన్ రాజు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటమ్మతల్లి గరగల ఉత్సవం



కోటమ్మతల్లి గరగలు ఊరేగిస్తున్న భక్తులు

నాతవరం: మండల కేంద్రంలో మంగళవారం శ్రీకోటమ్మతల్లి పండగకు గరగల ఉత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. గ్రామస్తులు కోటమ్మతల్లిని గ్రామ దేవతగా పూజిస్తూ, మూడేళ్లకోసారి పండగ నిర్వహిస్తారు. సంప్రదాయం మేరకు ఈ ఏడాది కూడా అమ్మవారి పండగను ఈ నెల 30న నిర్వహించేందుకు గ్రామపెద్దలు నిర్ణయించారు. అందులో భాగంగా గరగల ఉత్సవాన్ని ప్రారంభించి, గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ఒకటో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు

మాకవరపాలెం: ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో నరేష్ మంగళవారం తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో బడుగు, బలహీన వర్గాల పిల్లల ఉచిత ప్రవేశాలకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే తొలి విడత దరఖాస్తులు స్వీకరించారు. రెండో విడతగా ఈ నెల 6 నుంచి 15 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అకాల వర్షం.. వరి చేలకు నష్టం

ఆరుగాలం శ్రమించిన పంట.. ఫలసాయం చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు. రబీ వరి సాగు రైతులకు కునుకులేకుండా చేశాయి. ఇప్పటికే దాదాపుగా కోతలు పూర్తయ్యాయి. ఒకటిరెండు రోజులు పొలంలో వరి పనలు ఆరబెట్టి, కుప్పలు వేయాలనుకున్నారు. సోమవారం తొలివేకువ నుంచే దంచికొట్టిన వాన, పంట చేలను పూర్తిగా తడిపేసింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.

- వర్షాలకు తడిచిన రబీ వరి పంట
- ఆదుకోవాలని బాధిత రైతుల వినతి



వడ్డాది కస్పా పొలాల్లో తడిచిన వరి పనలను ఒడ్డుకు చేర్చుతున్న మహిళా రైతు

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలు రబీ వరి రైతులకు కష్టం తెచ్చిపెట్టాయి. పండిన రబీ వరి చేలను వారం రోజులుగా కోతలు కోసి, పొలంలోనే ఉంచారు. కొందరు వరి పనల్ని కుప్పలు పెట్టినా, చాలా మంది పనల్ని ఆరబెట్టారు. సోమ, మంగళవారం కురిసిన వర్షాలకు వడ్డాది, చిన అప్పనపాలెం, దిబ్బిడి, విజయరామరాజుపేట, బుచ్చెయ్యపేట, కందిపూడి తదితర గ్రామాల్లో రైతులు కోసిన వరి పనలు తడిసిపోయాయి. పలువురు రైతులు తడిసిన వరి పనల్ని ఒడ్డుకు చేర్చి అరబెడుతున్నారు. ఆరిన పనల్ని దులిపి ధాన్యంను ఒబ్బిడి చేసుకుంటున్నారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మాడుగుల రూరల్: అకాల భారీ వర్షాలకు రైతులు నష్టపోయారు. వీరవల్లి అగ్రహారం శివారు ఎరుకువాడ, లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో సుమారు 20 ఎకరాల వరి పంట నీట మునిగింది. గత నెల 28, 29, 30, తేదీల్లో రైతులు వరి పంటను కోసి, మడుల్లో ఆరబెట్టారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కురిసిన వర్షానికి పూర్తిగా వరి పనలు తడిసి ముద్దయ్యాయి. మంగళవారం కాస్త ఎండ కాయడంతో మడుల్లోని వరి పనల్ని ఒడ్డుకు చేర్చడంలో రైతులు బిజీ అయ్యారు. ఎరుకువాడ మెట్టమీద కొందరు రైతులు తమ పంటను ఎండబెడుతున్నారు. వరి పంట చేతికి వచ్చిన సమయంలో ఇలా వర్షపు నీటికి తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. మండలంలోని ఒమ్మలి, గాదిరాయి, సత్యవరం, జాలంపల్లి, కింతలి తదితర గ్రామాల్లో వేసిన వరి పంట కూడా నీట తడిసింది. తడిసిన వరి పంటను అయా గ్రామాలకు చెందిన వ్యవసాయ, ఉద్యానవనశాఖ సహాయకులు మంగళవారం పరిశీలించారు. సమాచారాన్ని మండల వ్యవసాయ శాఖ కార్యాలయానికి నివేదించారు.



ఎరుకువాడ మెట్ట మీద ఎండబెట్టిన వరి పనలు

అంగరంగ వైభవం.. అమ్మవార్ల ఉత్సవం

- 11 ఏళ్ల తర్వాత తారువ మర్లమాంబ పెద్ద పండగ
- ఆర్లి, ఎ.భీమవరంలో గ్రామదేవతల ఉత్సవాలు



తారువలోని మర్లమాంబ సన్నిధిలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దంపతులు

దేవరాపల్లి: తారువ ప్రజల ఆరాధ్య దైవం శ్రీమర్లమాంబ అమ్మవారి పెద్ద పండగ మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. 11 ఏళ్ల తర్వాత జరిగిన అమ్మవారి జాతరకు భారీగా భక్తజనం తరలివచ్చారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి మర్లమాంబ అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. ఆలయానికి విచ్చేసిన భక్తజనాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ రోజంతా అమ్మవారి సన్నిధిలోనే గడిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లను స్వయంగా ఆయనే పర్యవేక్షించారు. రాత్రికి ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తజనాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి.

కె.కోటపాడు: ఆర్లి గ్రామంలో పైడితల్లమ్మ, ఎ.భీమవరంలో మరిడిమాంబ అమ్మవార్ల పెద్ద పండగలను గ్రామస్తులు మంగళవారం ఘనంగా జరిపారు. ఐదేళ్ళకోసారి రెండు గ్రామాల్లో అమ్మవార్ల పెద్ద పండగలను జరపడంను ఆనవాయితీగా వస్తోంది. పండగ నేపథ్యంలో రెండు గ్రామాలకు పెద్ద సంఖ్యలో బంధువులు, స్నేహితుల రాకతో గ్రామాల్లో సందడి నెలకొంది. ఇరువురు అమ్మవార్లను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామాల్లో ప్రజలు ఐక్యతతో పండగలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్‌లు తర్రా సన్యాసమ్మ, శేషు, బోళెం సందీప్, బోళెం కృష్ణారావు పాల్గొన్నారు.

దేవాలయ భూముల వేలం వాయిదా



రామాలయం వద్ద వేలంపాటలో యలమంచిలి దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు

నాతవరం: ఆశించిన విధంగా వేలంపాటలో దేవాలయ భూములకు కౌలు రాకపోవడంతో వేలం పాటను వాయిదా వేసినట్టు యలమంచిలి దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు తెలిపారు. నాతవరంలోని శ్రీనూకాలమ్మ గంగాదేవి ఆలయ భూముల కౌలుకు స్థానిక రామాలయం వద్ద మంగళవారం వేలం పాట నిర్వహించారు. గతం కంటే తక్కువ మొత్తం కౌలును పాటదారులు పేర్కొన్నారు. నిబంధనల మేరకు గతేడాది కంటే ఈ ఏడాది అధికంగా ఆదాయం వస్తేనే పాట ఖరారు చేయనున్నట్టు శ్రీనివాసరాజు తెలిపారు. వాయిదా పడిన వేలంపాటను ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం ఈవో సాంబశివరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

యూనిఫామ్ ధరించకపోతే జరిమానా

సచివాలయ ఉద్యోగులకు డీఎల్‌డీవో హెచ్చరిక



వల్సంపేట సచివాలయంలో ఎంపీడీవోను వివరాలు అడుగుతున్న డీఎల్‌డీవో ఉదయశ్రీ

నాతవరం: సచివాలయ ఉద్యోగులు యూనిఫామ్ ధరించకుండా విధులకు వస్తే జరిమానా విధిస్తామని నర్సీపట్నం డీఎల్‌డీవో ఉదయశ్రీ హెచ్చరించారు. మండలంలోని వల్సంపేట, నాతవరం సచివాలయాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులను క్షుణంగా పరిశీలించి సచివాలయాలు ద్వారా ప్రజలకు అందించే సేవలపై పంచాయతీ కార్యదర్శులను అడిగారు. సచివాలయ ప్రాంగణం అధ్వానంగా ఉండటం, ఉద్యోగులు యూనిఫామ్ ధరించకపోవడంపై ఆగ్రహించారు. ప్రభుత్వం యూనిఫామ్ ఇస్తే మీరంతా ధరించకుండా రావడటమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వ నిబంధనల్ని ప్రతి ఉద్యోగి పాటించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించి, జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులచే ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. సచివాలయానికి వివిధ పనులపై వచ్చే ప్రజల పట్ల సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఉద్యోగులంతా విధిగా సమయ పాలన పాటించాలన్నారు. ఇంటి పన్నుల వసూలు, తాగునీటి సమస్య, డ్రైనేజీలు, వీధిలైట్లు తదితర అంశాల్లో కార్యదర్శులు నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వెంకన్న ధ్వజ స్తంభం తరలింపు



ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న అవుగడ్డ రామ్మూర్తినాయుడు

దేవరాపల్లి: మారేపల్లి గ్రామానికి ఆనుకుని కొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి నూతన ఆలయం వద్దకు మంగళవారం ధ్వజ స్తంభాన్ని తరలించారు. దమ్మలపాటి అప్పారావు చౌదరి నేతృత్వంలో ఆలయాన్ని పునర్నిర్మాణం చేస్తున్నారు. ముందుగా కొండ దిగువన ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు జరిపి, అనంతరం కొండపైకి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అవుగడ్డ రామ్మూర్తినాయుడు, భుగత వెంకటరమణ, మారేపల్లి ఎంపీటీసీ అవుగడ్డ రామదేవి, మాజీ సర్పంచ్ కోటిపల్లి నాయుడు, బుదిరెడ్ల బాబూరావు, అవుగడ్డ వెంకట త్రినాథనాయుడు, పరిసర గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ



కేజే పురంలో పింఛన్లు అందిస్తున్న సర్పంచ్ రమణబాబు, సచివాలయ సిబ్బంది



రైవాడలో లబ్ధిదారులకు నూతన పింఛన్లను అందిస్తున్న సర్పంచ్ చల్లా లక్ష్మి

మాడుగుల రూరల్: కొత్తగా మంజూరైన పింఛన్లను కె.జె.పురంలో మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక సచివాలయం–1 పరిధిలో 6 పింఛన్లు, సచివాలయం–2 పరిధిలో 7 పింఛన్లను సర్పంచ్ జామి రమణబాబు చేతులు మీదుగా అందించారు. వీటితో పాటు 12 అభయహస్తం పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెంకి శివ, వెల్ఫేర్ అసిస్టెంట్లు వేచలపు చిన్న, సాగర్, స్థానిక నాయకులు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: రైవాడ సచివాలయం పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను స్థానిక సర్పంచ్ చల్లా లక్ష్మి మంగళవారం లబ్ధిదారులకు అందించారు. ఇందులో వైఎస్సార్ పింఛన్ కానుక-6, అభయ హస్తం పింఛన్లు-9 ఉన్నాయి. కార్యక్రమంలో ఉగ్రాకుల అప్పారావు, చల్లా నాయుడు, కె.ఎస్.అప్పలనాయుడు పాల్గొన్నారు. పింఛన్లు మంజూరు చేసిన సీఎం జగన్‌కు, కృషి చేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు లబ్ధిదారులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

చీడికాడ: మండలంలోని చెట్టుపల్లిలో నూతనంగా మంజూరైన 14 పింఛన్లను అర్హులకు స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు అందించారు. వీటిలో 10 అభయహస్తం పింఛన్లు, 2 వితంతు, 2 వృద్ధాప్య పింఛన్లు ఉన్నాయి. కార్యక్రమంలో పార్టీ నేతలు పాతాళం గంగరాజు, తుంపాల శ్రీను, పాతాళం దేముళ్లు, విస్సరపు లక్ష్మి, పాతాళం చిన్నంనాయుడు తదితరులున్నారు.

కోతుల బెడద వదిలించండి

కలెక్టర్‌ను వేడుకున్న 16 గ్రామాల రైతు సంఘ నాయకులు



కలెక్టర్‌ను కలిసి కోతుల బెడదను విన్నవిస్తున్న రైతు సంఘ నాయకులు

బుచ్చెయ్యపేట: కోతులను పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించి ఆదుకోవాలని 16 గ్రామాల రైతు సంఘ నాయకులు జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని కలిసి, తమ గోడును విన్నవించారు. బుచ్చెయ్యపేట మండలానికి వచ్చిన కలెక్టర్‌ను రైతు సంఘ నాయకులు మంగళవారం కలిశారు. లోపూడి, బంగారుమెట్ట, ఎల్‌బీ పురం, శింగవరం, పీడీపాలెం, చిన అప్పనపాలెం, భీమవరం, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, కొండెంపూడి, కొమ్మళ్లపూడి, గంటి కొర్లాం తదితర గ్రామాల్లో వేలాది కోతులు గుంపులుగా తిరిగి పంటలను ధ్వంసం చేయడంపై గతంలో రైతులు ఆందోళనకు దిగిన విషయాన్ని తెలిపారు. మూడు నెలల క్రితం సుమారు 2,200 కోతులను పట్టుకుని తరలించారన్నారు. మరో వెయ్యి కోతులు మిగిలిపోయినట్టు తెలిపారు. కోతులు పంట చేల మీద పడటంతో, ఏటా ఒక్కో రైతు రెండు మూడు లక్షల రూపాయల ఆదాయాన్ని కోల్పోతున్నట్టు రైతు సంఘ నాయకులు కలెక్టర్‌కు తెలిపారు. త్వరలోనే పూర్తి స్థాయిలో కోతుల నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిట కోఆపరేటివ్ పర్సన్ ఇన్‌చార్జి సాయం రమేష్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, ఎల్‌బీ పురం సర్పంచ్ తమరాన శ్రీను, మండల రైతు విభాగం నాయకులు తమరాన రమణ, వేపాడ మధు, యెనుముల వాసు తదితరులున్నారు.

పశువుల పాక దగ్ధం

మాకవరపాలెం: మండలంలోని జి.కోడూరులో ప్రమాదవశాత్తూ పశువుల పాక దగ్ధమైంది. గ్రామంలోని కర్రి అప్పారావుకు చెందిన పశువుల పాకకు మంగళవారం నిప్పంటుకుంది. ఆ సమయంలో పాకలో పశువులు లేకపోవడంతో నష్టం వాటిల్లలేదు. లోపల ఉన్న దాణా మొత్తం కాలిబూడిదయిందని రైతు వాపోయాడు.

ఉచిత వైద్య శిబిరం రేపు

మాడుగుల రూరల్: మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో ఈ నెల 4న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మోసూరి ఈశ్వరరావు క్లినిక్ వద్ద నిర్వహించనున్న శిబిరంలో విశాఖ దరి సంగినవలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి వైద్యులు ఉదయం 7 గంటల నుంచి రోగులకు వైద్య సేవలందిస్తారని పేర్కొన్నారు. ప్రధానంగా గైనిక్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ వ్యాధులతో పాటు జనరల్ ఫిజీషియన్ సేవలు కూడా అందిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పోటీ పరీక్షల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

మునగపాక : విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలని డాక్టర్ సంతోష్ బాబ్జీ కోరారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. సాంకేతిక విద్య -ఆవశ్యకతపై ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యుడు కె.వి.రమణ, దక్షిణామూర్తి, మాడెం జోగారావు, పిల్లా జగదీష్, ఆడారి సతీష్, శివకోటి దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు. దీనిలో భాగంగా మునగపాక హైస్కూల్లో చదువుకొని ఉన్నత చదువుల్లో భాగంగా పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్న సంతోష్ బాబ్జీని పలువురు సత్కరించారు.

ఘనంగా గజ్జాలమ్మ పండగ



పరుగు పందెంలో దూసుకెళ్తున్న ఎడ్ల బండి

బుచ్చెయ్యపేట: బుచ్చెయ్యపేట మండలం ఎల్.శింగవరం గ్రామ దేవత గజ్జాలమ్మ పండగ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని గ్రామస్తులంతా ప్రత్యేక పూజలు చేశారు. పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల బళ్ల పరుగు పందెం ఆకట్టుకుంది. పందెంలో గెలుపొందిన విజేతలకు నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులను అందించారు. రాత్రికి ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని అలరించాయి.

10 నుంచి ఇంటింటా ధర్మ ప్రచారం



సమరసతా సేవా ఫౌండేషన్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : ఈ నెల 10 నుంచి ఇంటింటా ధర్మ ప్రచారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సమరసతా సేవా ఫౌండేషన్ సభ్యులు కె.రాజు, బి.వి రమణ తెలిపారు. అచ్యుతాపురంలోని శ్రీ కృష్ణ, ఆంజనేయ స్వామి దేవాలయాల్లో మంగళవారం మండల స్థాయి సమరసతా సేవా ఫౌండేషన్ సమావేశంలో జరిగింది. ప్రతి నెలా దేవాలయాల్లో సామూహిక హారతి నిర్వహించాలని, ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు, అప్పలనాయుడు, లాలం నాని, కిలాడి రమణ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు



ఆశా కార్యకర్తలతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి

ఎస్.రాయవరం : వైద్య సిబ్బంది సకాలంలో పీహెచ్‌సీకి వచ్చి సేవలందించకుంటే సహించేది లేదని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో కె.వీరజ్యోతి అన్నారు. సర్వసిద్ది పీహెచ్‌సీని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది ఎవరెక్కడ ఉన్నారనే దానిపై ఆరా తీశారు. ప్రజల నుంచి ఫిర్యాదు రాకుండా వైద్య సేవలు అందించాలన్నారు. ఆశా డే కావడంతో ఆశా కార్యకర్తలతో మాట్లాడారు గ్రామాల్లో వారు అందిస్తున్న సేవలపై ప్రశ్నించారు. ప్రభుత్వం వైద్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందని, ప్రభుత్వ లక్ష్యాలను చేరువయ్యేలా సిబ్బంది పని చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వాసంతి, ఆశా నోడల్ అధికారి ఎం.రత్నం, ఆరోగ్య విస్తరణాధికారి టి.నాగేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

10,11 తేదీల్లో ఆలయ భూముల కౌలుకు వేలంపాట

మునగపాక : మండలంలోని పాటిపల్లి, రామగిరి ఆలయాలకు సంబంధించిన దేవదాయ భూములకు ఈ నెల 10, 11 తేదీల్లో కౌలుకు వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఈవో పీఎస్ఎన్ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటిపల్లి శ్రీ ఆహోబిల లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన 7.32 సెంట్ల భూమికి ఈ నెల 10న అలాగే రామగిరి శ్రీ కోదండ సీతారామ ఆలయానికి చెందిన 10.15 సెంట్ల భూమికి ఈ నెల 11వ తేదీన వేలం నిర్వహిస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆశ వర్కర్ల వినతి



వైద్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న ఆశ కార్యకర్తలు



చీడికాడలో వినతి పత్రం అందిస్తున్న ఆశ వర్కర్లు

మాడుగుల రూరల్: ఆశ కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ మండల ఆశా కార్యకర్తల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి లీలాప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. గ్రామ స్థాయిలో వైద్య సేవలందిస్తున్న ఆశ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించి, గ్రూప్ ఇన్సూరెన్స్, ప్రసూతి సెలవులు, కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని కోరారు. తమపై వేధింపులను అరికట్టి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల యూనియన్ అధ్యక్షులు జి.లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పడాల ప్రసన్న, ఏపీ గిరిజన సంఘం ఐదవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.నర్సింహమూర్తి పాల్గొన్నారు.

చీడికాడ: ఆశ కార్యకర్తల సమస్యల్ని పరిష్కరించి, వారిని ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం పెదగోగాడ, చీడికాడ పీహెచ్‌సీ వద్ద ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించి, చీడికాడలో ర్యాలీ చేపట్టారు. అనంతరం చీడికాడ వైద్యాధికారులకు వినతి పత్రాలు అందించారు.

వైఎస్సార్ యంత్ర సేవా పథకంపై అవగాహన



కె.వెంకటాపురం ఆర్బీకే వద్ద జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్, అధికారులు

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ అన్నారు. కె.వెంకటాపురంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం వైఎస్సార్ యంత్ర సేవా పథకంపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి ఉమా ప్రసాద్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం ముఖ్య ఉద్దేశ్యం, దరఖాస్తు విధానం వివరించారు. సాగు పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని పండగ చేయాలనే సంకల్పంతో సీఎం జగన్ రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రమేష్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా సమస్త వ్యవసాయ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్లు చిట్టిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మండల కోఆర్డినేటర్ వాసు

నాతవరం: కాలానుగుణంగా వస్తున్న మార్పుల మేరకు డ్వాక్రా మహిళలు కూడా అన్‌లైన్ విధానంపై అవగాహన పెంచుకోవాలని వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సిబ్బందికి ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న లోకోస్ యాప్ వినియోగంపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ యాప్ ద్వారా అన్ని వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. డ్వాక్రా సభ్యుల డేటాను యాప్ ద్వారా అప్‌డేట్ చేస్తే రానున్న రోజుల్లో ప్రభుత్వ ప్రయోజనాలను నేరుగా అందుకోవడం, మరిన్ని పథకాలను తెలుసుకోవడానికి వీలవుతుందన్నారు. ఈ విషయాలను గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. లోకోస్ యాప్‌పై మండల కోఆర్టినేటర్ వాసు వివరించారు. కార్యక్రమంలో వెలుగు క్లస్టర్ కోఆర్టినేటర్ రుత్తల శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.